క్లుప్తంగా

అమరవీరుడు మురళీనాయక్ సేవలను స్మరించుకోవాలి

నిజాంపట్నం: అమరవీరుడు మురళీనాయక్‌ను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. మాజీ సైనిక ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం నిజాంపట్నంలో నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సేవలో ప్రాణాలు అర్పించిన మురళీనాయక్ ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. కుటుంబాలకు దూరంగా దేశ సరిహద్దుల్లో నిత్యం పోరాడుతున్న సైనిక కుటుంబాలను మనం గౌరవించుకోవాలని కోరారు. వీర మరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు సెల్యూట్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా నిజాంపట్నం పంచాయతీ ఆధ్వర్యంలో బీట్ ది హీట్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సుబ్బయ్య, ఎంపీడీఓ నాగలక్ష్మి, ఎంపీటీసీ నాజర్ ఖాన్, వివిధ శాఖల అధికారులు, మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



బాపట్ల: స్టువర్టుపురంలో చోరీకి పాల్పడిన కేసులో నిందితుడిన్ని ఎస్ఐ భాగ్యరాజు శనివారం అరెస్టు చేశారు. ఈమేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సుమారు ఏడాది క్రితం స్టువర్టుపురం పెద్ద గ్యాంగ్‌కు చెందిన దేవర కిరణ్మయి ఇంట్లో ఎవరు లేనప్పుడు ఆమెకు చెందిన బంగారు నాన్‌తాడును ఐదుగురు వ్యక్తులు కలిసి దొంగిలించారని తెలిపారు. వీరిలో ఇద్దరు నాటు సారా కేసులో జైలులో ఉండగా బెయిల్ వేసేందుకు ఖర్చుల నిమిత్తం దొంగిలించిన ఆ నాన్‌తాడును తాకట్టు పెట్టేందుకు ఐదుగురిలో ఒకడైన మాదిగాని రామచంద్రకుమార్ ప్రయత్నించగా మాటువేసిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ భాగ్యరాజు తెలిపారు.

జల పరిరక్షణకు అందరూ కృషి చేయాలి



బాపట్ల: నీటిని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాల డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ పేర్కొన్నారు. నీరు–మీరు కార్యక్రమంలో భాగంగా కళాశాల నుంచి ప్రదర్శన చేపట్టారు. 2000 సంవత్సరం నుంచి జలసంరక్షణ మిషన్ ప్రారంభించారని డాక్టరు ఎం.సర్దార్‌బేగ్ గుర్తు చేశారు. నీటి వనరుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారించడానికి అవగాహన కల్పించాలని సూచించారు. నీటి సంరక్షణ, పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. నీటి వనరుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని నిర్ధారించడం, వారికి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సిహెచ్ సోమేశ్వరరావు, టీచింగ్ అసోసియేట్ జి.నూకరత్నం, వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ వై.ఫణీంద్ర కుమార్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండండి



తెనాలిఅర్బన్: ఎయిడ్స్ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని నవచైతన్య కళామండలి నిర్వాహకుడు కృష్ణ కిషోర్ పేర్కొన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కళాజాత నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో పలు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మూడు పదులు దాటిన వారికి బీపీ పరీక్షలు తప్పనిసరి



తెనాలిఅర్బన్: 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ తప్పని సరిగా రక్తపోటు (బీపీ) పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఎన్‌సీడీ నోడల్ అధికారి దివి శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యశాలలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక రక్తపోటు వలన అనేక అనార్థలు ఉన్నాయని చెప్పారు. వాటి వలన కలిగే దుష్ప్రభావాలను, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌పీహెచ్‌ఎల్‌ఈ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మంజూష, పీజియోథెరపిస్ట్ డాక్టర్ ఎస్.అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

భూతాపం నివారణకు మొక్కలు దోహదం

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



నెహ్రూ బొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న అధికారులు

రేపల్లె: ఉష్ణోగతలను తగ్గించుకునేందుకు మొక్కల పెంపకమే ప్రధాన మార్గమని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ చెప్పారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బీట్ ద హీట్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మొక్కల పెంపకం ద్వారా ఉష్ణోగతలను తగ్గించి జీవవైవిధ్యాన్ని పెంపొందించవచ్చునని చెప్పారు. చెట్ల నరికివేత, అడవులు అంతరించిపోవడం, ఎలక్ట్రానిక్ వస్తువుల, వాహనాల వినియోగం పెరగడంతో పగటి ఉష్ణోగతలు అధికమై జన జీవన మనుగడకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఉష్ణోగతలను తగ్గించుకోవడానికి మొక్కల పెంపకమే ప్రధాన మార్గమని చెప్పారు. ఈ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి మొక్కల పెంపకంలో భాగస్వాములను చేయాలన్నారు. భవంతులు, పెరడల్లో పెరటి తోటలు, మొక్కలు పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించి ఆ దిశగా చర్యలు చేపట్టేలా చైతన్య పరచాలని కోరారు. ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి మొక్కల పెంపకంను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి తాలూకా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి డాక్టర్ అంబేద్కర్ విగ్రహం సెంటర్లో మానవహారంగా ఏర్పడి ఎలక్ట్రానిక్ వస్తువులను నివారిద్దాం – మొక్కల పెంపకాన్ని సాగిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, టీడీపీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, మెప్మా, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, అధికారులు

వేమూరులో...

వేమూరు: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎక్సైజ్ ఇన్‌చార్జి అధికారి బి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయం వద్ద శనివారం ఆయన మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఎక్సైజ్ సీఐ, ఎ. రవి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయంలో మొక్క నాటుతున్న అధికారులు, సిబ్బంది

సమాజహితుడు ఈఎల్ నారాయణ



ఈఎల్ నారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ పి.సి.సాయిబాబు, తదితరులు

బాపట్ల: బాపట్లలో వినియోగదారుల ఉద్యమం, విద్యారంగంలో రెండు దశాబ్దాల పాటు విశేషమైన కృషి చేసిన ఈఎల్ నారాయణ చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. ఈఎల్ నారాయణ 24వ వర్ధంతి సందర్భంగా శనివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఈఎల్ నారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి శనివారం నివాళులర్పించారు. డాక్టర్ పి.సి.సాయిబాబు మాట్లాడుతూ విజ్ఞాన సమితిని ఏర్పాటు చేసి బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని గుర్తు చేసుకున్నారు. వినియోగదారుల హక్కులపై పలువురికి అవగాహన కల్పించారని, 'ఫిలిం క్లబ్' ఉద్యమం చేపట్టి, ప్రజల మానసిక వికాసానికి దోహదపడ్డారన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కేవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆడే బుజ్జి, సాంబశివరావు, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట సాగుహక్కు ధ్రువీకరణ పత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ లోకేశ్వరి

అమర్తలూరు(వేమూరు): కౌలు రైతులకు పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో శనివారం పంట సాగు హక్కు ధృవీకరణ పత్రాలపై కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలను ప్రతి కౌలు దారుడు పొందాలన్నారు. ఈ–పంట నమోదు, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు నష్టపరిహారం నమోదుకు, రాయితీపై విత్తనాలు పొందుటకు, అన్నదాత సుఖీభవ పొందేందుకు పంట సాగు ధ్రువీకరణ పత్రం చాలా అవసరమన్నారు. రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ పి.వెంకటేశ్వర్లు, టి.శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

20న మండల కేంద్రాల్లో నిరసన



ఉపాధిహామీ కార్మికులతో అప్పారావు, శివసాంబిరెడ్డి

సంగంజాగర్లమూడి (తెనాలి): ఉపాధి హామీ కార్మికుల, కౌలురైతుల సమస్యలపై ఈనెల 20న అన్ని మండల కేంద్రాలు, అన్ని సచివాలయాలు వద్ద జరిగే నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఉపాధి హామీ కార్మికుల బకాయిలు చెల్లించాలని, కౌలు రైతులకు, యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డు ఇచ్చేవిధంగా చట్ట సవరణ చేయాలని, రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. రూరల్ మండలం సంగంజాగర్లమూడి గ్రామంలో శనివారం ఆయా సంఘాల నాయకులు, ఉపాధి పని ప్రదేశాన్ని పరిశీలించారు. ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేసిన పనికి బిల్లు రాలేదంటూ ఉపాధి కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం కూడా రావటం లేదని వాపోయారు. ఉపాధి కార్మికులుగా చిన్న, సన్నకారు రైతులం ఉన్నామని గుర్తుచేశారు. రైతుమిత్ర గ్రూప్ ద్వారా పొదుపు జమచేసినా, తమకు ప్రభుత్వం నుంచి బ్యాంకు లోన్ రావడం లేదన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టిందన్నారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వటం లేదని, దీంతో ప్రధానంగా కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఉపాధి పనిలోనైనా టైముకు డబ్బులు వస్తాయి అని పనికి వస్తున్నారని చెబుతూ, ఇక్కడ కూడా చేసిన పనికి వారాల తరబడి డబ్బులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. ఉపాధి కార్మికులకు బిల్లులు రాకపోతుంటే ఈ శాఖ మంత్రి అయిన పవన్ కళ్యాణ్ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిలను ఇప్పించేందుకు ప్రయత్నం చేయడం లేదన్నారు. అలాగే కౌలు రైతులకు చిన్న సహకార రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

- పనులు కావటం లేదని టీడీపీ కార్యకర్తలు బాధతో ఉన్నారు
- ముందుగా మంత్రి, ఎమ్మెల్సీని కలవండి
- అప్పటికీ పనులు కాకుంటే నా దగ్గరకు రండి
- ప్రజాసమస్యల పరిష్కార వేదికపై కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



అర్జీదారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

తెనాలి: ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలోని శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ప్రజాసమస్యలపై వినతిపత్రాలను స్వీకరించారు. రైతువారి సమస్యలు, డ్రైన్లు, డొంకలు, రోడ్లు, పారిశుద్ధ్య సమస్యల వంటి అంశాలపై తెనాలి రూరల్ మండలం, కొల్లిపర మండలాల నుంచి వచ్చిన ప్రజలనుంచి అర్జీలను తీసుకున్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలు, సమస్యలపై సంబంధితశాఖల అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ప్రసంగిస్తూ, తెలుగుదేశం కార్యకర్తలు తమకు పనులు కావటం లేదనే ఆవేదన వ్యక్తంచేస్తున్నారని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని చెబుతూ 'మీ సమస్యలపై ముందుగా స్థానిక మంత్రి నాదెండ్ల మనోహర్‌ను, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కలవాలని సూచించారు. అప్పటికీ పనులు కానిపక్షంలో తనవద్దకు రావాలని గుంటూరులోని తన కార్యాలయంలో ప్రతి శుక్రవారం అర్జీలను ఇవ్వొచ్చని చెప్పారు. ఏడాదిలోనే అన్ని పనులు కావటం కష్టమని చెబుతూ రెండేళ్లలో అభివృద్ధి కనిపిస్తుందని వ్యాఖ్యానించారు. గుంటూరు–తెనాలి రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పంటకాల్వలు, డ్రెయిన్ల బాగుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. సాగునీటి సంఘాల బాధ్యులు ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా పనులు చేయాలని సూచించారు. తెనాలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, వైకుంఠపురం ఆలయం పాలకమండళ్లను త్వరలో నియమించనున్నట్టు చెప్పారు. సమావేశంలో పంచాయతి సర్పంచ్ పరుచూరి విజయలక్ష్మి, మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి, విద్యుత్ డివిజనల్ ఇంజినీరు వీవీ చిరంజీవి, పంచాయతి కార్యదర్శి ఇంద్రజ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయం దేశానికే గర్వకారణం



బాపట్ల: ఉగ్రవాదులను తుదముట్టించేందుకు భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం దేశానికే గర్వకారణమని కర్లపాలెం జడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావటంతో శనివారం మండల కేంద్రంలో ప్రదర్శన చేపట్టారు. తొలుత సిందూర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ నక్కల లలిత కుమారి, తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటు నివారణకు చర్యలు తీసుకోవాలి

వేమూరు: అధిక ఎండలకు వడదెబ్బ రాకుండా పలు చర్యలు తీసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ జరీనా పర్వీన్ అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే నిర్వహించి, పలువురికి రక్తపోటు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వైద్యురాలు జరీనా పర్వీన్ అధిక రక్తపోటు నివారణ, వడదెబ్బకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నీళ్లు, పళ్ల రసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాధిక, సౌజన్య, అనిల్ కుమార్, శ్రీనివాసరావు, రవళి, సునీత, హెడ్ నర్సు పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: తెనాలిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి చెంచుపేట డొంక రోడ్డులో రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ ఎస్ఐ ఎన్. ప్రకాశరావు, సిబ్బంది శనివారం తనిఖీలకు వెళ్లారు. 30 కిలోల చొప్పున ఉన్న 40 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనపర్చుకున్నారు. విజయవాడకు చెందిన వ్యక్తి రేషన్ అక్రమాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు.

క్షయరహిత మండలంగా కృషి చేయాలి

డాక్టర్ వెంకట సుబ్బారావు



క్షయ వ్యాధి వ్యక్తులను పరీక్షిస్తున్న వైద్యులు

కొల్లిపర: క్షయ వ్యాధి రహితంగా కొల్లిపర మండలం ప్రథమ స్థానం సాధించే విధంగా ప్రతి వైద్యులు సిబ్బంది కృషి చేయాలని డాక్టర్ వెంకట సుబ్బారావు అన్నారు. మున్నంగి పీహెచ్‌సీ పరిధిలో శనివారం ఊపిరితిత్తుల టీబీకి మందులు వాడుతూ ఉన్న క్షయ వ్యాధిగ్రస్తుడితో నివసిస్తున్న కుటుంబ సభ్యులలో 18 సంవత్సరాలు దాటిన కుటుంబ సభ్యులకు సీవై టీబీ టెస్ట్ సీవైటీబీ చేయడానికి ఎయిమ్స్ నుంచి జూనియర్ రెసిడెంట్ డాక్టర్ ఉత్కర్ష తివారి ఆధ్వర్యంలో అర్హులైన వారికి సీవై టీబీ టెస్ట్ చేసినారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట సుబ్బారావు గారు మాట్లాడుతూ రాష్ట్ర క్షయ వ్యాధి నివారణ జాయింట్ డైరెక్టర్ టి.రమేష్ గారి ఆదేశాల మేరకు సై టీబి టెస్టులు చేస్తున్నామని, కొల్లిపర మండలాన్ని క్షయరహిత మండలంగా ఉండేందుకు కృషి చేస్తున్నామని తెలియజేసినారు. 2025 నాటికి క్షయ వ్యాధి లేని భారతదేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన ఈ సీవై టీబీ టెస్ట్ ఫలితాల ద్వారా క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులలో టీబీ రాకుండా ముందుగానే ప్రివెన్సన్ థెరపీ ఇవ్వొచ్చని తద్వారా కుటుంబ సభ్యులకు భవిష్యత్తులో క్షయ వ్యాధి వచ్చే అవకాశం లేదని తెలియజేశారు. తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్ మాట్లాడుతూ జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసరావు గారి సూచన మేరకు కొల్లిపరం మండలంలో సీవై టీబీ టెస్ట్ చేస్తున్నారని తెలియజేసినారు. క్షయ వ్యాధి లేని కొల్లిపర మండలంగా ఉండేందుకు ప్రతి ఒక్క వైద్య సిబ్బంది, ప్రతి ఒక్క పౌరుడు కృషి చేయాలని తెలియజేసినారు. కార్యక్రమంలో మున్నంగి పీహెచ్‌సీసి వైద్య సిబ్బంది కల్పన, ఆమని, వజీత, మస్తాన్ బి, కొల్లిపర సబ్ సెంటర్ వైద్య సిబ్బంది వేముల లక్ష్మీ, అనిత, మణెమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఎమ్మెల్ హెచ్ పి.కళ్యాణి ఆశా కార్యకర్తలు, జయప్రద, భవాని ,మల్లేశ్వరి, సుబ్బులు, పద్మ, జ్యోతి, విజయ కుమారి క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శానిటేషన్ సూపర్‌వైజర్‌పై మంత్రి ఆగ్రహం

తెనాలిఅర్బన్: జిల్లా వైద్యశాలలో అంతర్గత కాల్వలు దుర్భరంగా ఉన్నాయి. వీటిని ఎన్ని రోజులకు బాగు చేస్తున్నారు. వీటివలన మలేరియా, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందంటూ జిల్లా వైద్యశాల శానిటేషన్ సూపర్‌వైజర్ విజయసారధి పై మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం జిల్లా వైద్యశాలలో మంత్రి పర్యటించారు. ఆవరణలో ఖాళీ వాటర్‌బాటిల్స్, వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన ఆర్‌ఎంవో డాక్టర్ మల్లిఖార్జునరావుపై అసహనం వ్యక్తం చేశారు. అంతర్గత కాల్వలు కూడా పూడుకుపోయి కనిపించడంతో మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందిని పిలిపించాలని కమిషనర్ శేషన్నను ఆదేశించారు. సిబ్బంది అక్కడకు చేరుకోవడంతో వారితో మురుగు కాల్వల పూడికతీత పనులు చేయించారు. అలాగే పాత ఇనుప వస్తువులు అక్కడ ఉండటాన్ని గమనించిన ఆయన అక్కడి నుంచి తీసివేయాలని సూచించారు. అధికారులు వైద్యశాల ఆవరణను కూడా ప్రతి రోజు పరిశీలించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలను బాగు చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది నెల రోజుల పాటు వీటిని బాగు చేస్తారని చెప్పారు. అమరావతి ప్లాట్స్‌లోని అన్ని రోడ్లను మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించారు. ప్రజలు కూడా ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. క్యాజువాలిటీ విభాగాన్ని హెల్త్ హాస్పటల్ అధినేత డాక్టర్ నన్నపనేని ప్రతాప్ రూ.కోటితో అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. త్వరలో ఆధునిక పనులు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసారెడ్డి, కొమ్మురబత్తుని జయపాల్, దాసరి వీరవసంతరావు, బోయపాటి అరుణ, మట్లపూడి సంధ్యారాణి, తహశీల్దార్ గోపాలకృష్ణ, ప్రభుత్వ వైద్యశాల సీనియర్ వైద్యులు డాక్టర్ హనుమంతరావు, పలు ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతిజ్ఞలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ మల్లిఖార్జునరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి, పలువురువైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



తెనాలిటౌన్: స్థానిక బాలాజీరావుపేటకు చెందిన షేక్ మస్తాన్‌బీ క్యాన్సర్ వ్యాధి బారిన పడి అనారోగ్యంతో ఇబ్బంది పడుతుంది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు విడుదల చేయించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షలు బాధితురాలికి శనివారం అందజేశారు. ఆయన వెంట వార్డు ప్రెసిడెంట్ షేక్ దావూద్, సాయిగోపి, అక్బర్, రబ్బానీ ఉన్నారు.

వేసవి తీవ్రతను తట్టుకునేలా జాగ్రత్తలు పాటించాలి

ఎంపీడీఓ అత్తోట దీప్తి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

తెనాలిటౌన్: వేసవి తీవ్రతను తట్టుకునేలా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు ఎంపీడీవో అత్తోట దీప్తి సూచించారు. ప్రతి నెల మూడోవ శనివారం నిర్వహించే స్వర ఆంధ్ర- స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రూరల్ మండలం కఠెవరం గ్రామంలో బీట్ ద హీట్, సేఫ్ అండ్ హెల్దీ ఇన్ సమ్మర్ అనే నేపథ్యంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీడీవో అత్తోట దీప్తి పాల్గొని గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రావిచెట్టు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. పలు ముఖ్య కూడళ్లలో మొక్కలు నాటారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ వేసవి తాపాన్ని తట్టుకునేలా అవసరమైన రక్షణ చర్యలు పాటించాలని ప్రజలకు సూచించారు. ఎండలో తిరగడం వలన అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కాటన్ వస్త్రాలు ధరించాలని, బయటకు వెళ్ళేటప్పుడు వెంట తాగునీరు ఉంచుకోవాలని చెప్పారు. ప్రతి ఇంటిలో ఒక చెట్టు నీడ ఉంటే మంచిదని అన్నారు. వడదెబ్బ తగిలితే స్థానిక వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్, సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహిద్దీన్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



గజవాహనంపై గ్రామోత్సవం

తెనాలిటౌన్: శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మూడోవ రోజైన శనివారం ఉదయం 9.00 గంటలకు నిత్యహోమం, ఆలయ బలిహారణ వంటి కార్యక్రమాలను దేవస్థాన అర్చకులు నిర్వహించారు. అదే విధంగా సాయంత్రం 6.30గంటలకు గజవాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎంసెట్ పరీక్షల్లో ప్రతిభ చూపండి

తెనాలిఅర్బన్: ఈ నెల 19న జరిగే ఎంసెట్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పేర్కొన్నారు. జెవిఎస్ క్రాంతి కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సామ్రాట్ హోటల్‌లో ఎంసెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3 గంటల్లో రాసే పరీక్ష జీవితాన్ని మార్చివేస్తుందని చెప్పారు. అనంతరం ఈ-సెట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వ్యాయామం, యోగా తప్పనిసరిగా చేయాలి



కొల్లిపర: ప్రతి వ్యక్తి యోగ, వ్యాయామం పౌష్టిక ఆహారం పై పూర్తి అవగాహన కలిగి ఉండి వాటిని వారి జీవితంలో అనుసరించినప్పుడే వివిధ రోగాల నుంచి బయటపడవచ్చు అని మండల వైద్యాధికారి డాక్టర్ వి.సుబ్బారావు, కొల్లిపర సీహెచ్‌సీ వైద్యులు భరత్, వైద్య కేంద్రం ప్రధాన వైద్యులు డాక్టర్ మణికంఠ అన్నారు. శనివారం కొల్లిపర లోనే ఒకటి రెండు మూడు గ్రామ సచివాలయంలోని ఏఎన్ఎంలు, మున్నంగి పిహెచ్ సి వైద్యులు, కొల్లిపర సీహెచ్‌సీ వైద్యులు సిబ్బంది ప్రపంచ బీపీ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో బీపీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి మనిషి నిత్య జీవితంలో పౌష్టికాహారం తీసుకుంటూ ప్రతిరోజు కొంత సమయం యోగ, వ్యాయామం, ప్రతి 40 నిమిషాలకు మంచినీరు తీసుకోవడం వలన బీపీ వంటి అనేక వ్యాధులకు దూరంగా ఉండటం జరుగుతుందని తెలిపారు.